# చిలక జోస్యం

నోరులేని చిలకను నమ్మే మనం
నోరున్న మనిషిని నమ్మడం లేదు
కారణం మన మౌఢ్యం
ఫలితం

— జయప్రద

కొండల నరశింహానికి ఈ రోజు చాలా ఆనందంగా వుంది. రోజూ కంటే చాలాసంపాయించాడు. అందుకే ఈరోజు రోజూకంటేముందుగా బిచాణా ఎత్తేసాడు. తుండుగుడ్డ దులిపి భుజాన వేసుకున్నాడు. అట్ట ముక్కలు గట్టిగా కట్టి చేతి సంచిలో వేసుకున్నాడు. పంజరంలో చిలకను చేతిలోకి తీసుకుని రెండుసార్లు ముద్దు పెట్టుకుని మరలా చిలకను అందులోకి పంపేసి ఆ చిన్న పంజరం తాలూకు చిన్న తలుపును మూసేసి ఆ పంజరాన్ని చేతికి తగిలించుకుని ఉషారుగా అడుగులేయ సాగాడు.

ఈరోజు ఇంటిదాన్ని తీసుకుని ఒంటరిగా సినిమా కెళ్ళాల ఎప్పుడూకుదిరి చావదు. ఎవరో ఒకరు చుట్టాలమంటూ సమయానికొచ్చి వాల్తారు. చుట్టాలకు తిండయితే తప్పదుగనక పెడ్తాడు. గానీసినిమాలకు కూడాఎక్కడ తీసుకెళ్ళగలడు?

* * * *

చెప్పు నిజం చెప్పు. నిజం చెప్తే వదిలేస్తాను. ఎక్కడ పెట్టావో చెప్పు నిజంగా వదిలేస్తాను.

తొమ్మిదోసారి అడుగుతూన్నాడు ఆ ఇంటి యజమాని. మిస్టర్ మాధవరావు వాకిట కవతల కొద్దిగా తల మాత్రం బయట పెట్టి నిశ్శబ్దంగా నిల్చోనుంది ఆ ఇంటి యజమానురాలు కారుణ్య. అంత ఖరీదైన నగ పోగొట్టుకున్న ఆమె ముఖంలో ఏ భావాలు కదలాడుతున్నాయో గమనించడానికి వీలులేకుండా ఆ గదిలో లైటు ఆర్పేసి వుంది.

"తెలీదయ్యా దేముడిమీద ఒట్టు. నా పెళ్ళాం బిడ్డల మీద ఒట్టు. నమ్ము బాబాయ్యా" పదేపదే అదే జవాబిస్తున్నాడు ఆ ఇంటి నౌకరు పోలయ్య.

మాధవరావు ముఖంలో ఈసారి ప్రసన్నత మాయమయింది. అతని కళ్ళు నిప్పుకణాలయ్యాయి. అతని చూపులు కత్తి మొనల్లా ఆ వరండా స్థంభాన్ని అనుకుని చేతులు కట్టుకు నిల్చున్న పోలయ్యను భయపెట్టాయి.

మాధవరావు లేచి నిల్చున్నాడు. అతని నడుముచుట్టూ వున్న తోలు బెల్టును లాగి చేతిలోకి తీసుకున్నాడు. అసలే బెదురుతున్న పోలయ్య కళ్ళను ఇంకా బెదరగొడుతూ మిసెస్ కారుణ్య తన భర్తకు ఎంతో ప్రియంగా మనసుపడి, మోజుపడి పది అంగళ్ళు తిరిగి మరీ తమ పెళ్ళిరోజు బహుమతిగా యిచ్చిన సుందరమైన, ఖరీదయిన తోలు బెల్టు గాలిలోకి లేచింది.

"రేయ్! ఇదే ఆఖరుసారి అడుగుతున్నాను. నా సహనం చచ్చిపోకముందే ఈ బెల్టు నీ ఒంటిమీద పడకముందే చెప్పేసేయ్....ఆ నెక్లెస్ ఎక్కడ పెట్టావో చెప్పేసేయ్"

"లేదు లేదు బాబయ్యా? నేను తియ్యలేదు" తల అడ్డంగా వూపాడు పోలయ్య. ఆ బెల్టుదెబ్బ తనమీద పడ్తుందని భయపడి.

"ఇన్నాళ్ళనుండున్నాను బాబయ్యా, నా సంగతి మీకు తెలవదా" అని బ్రతిమిలాడుకుంటున్నాడు. అతని కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయి.

★ ★ ★ ★

తోలు బెల్టు గాలిలో లేవగానే అంతవరకూ నిశ్శబ్దంగా వున్న అనిటవుట్ బయట స్థలంజనమయమూ శబ్దమయమూ అయింది. ఇలాటి సీనులు చూడడమంటే ఎంత ఇష్టమో కొంత మందికి. ఇలా కాలక్షేపం చేయను ఎంత కోరికో వాళ్ళల్లో!!

"పోలయ్యా! అయ్యగారి కెందుకు కొట్టాడనే చెడ్డపేరు తెస్తావ్. ఎక్కడయినా దాన్ని కుదువ పెట్టుంటే చెప్పేసెయ్యి భయపడకు. అయ్యగారు నిన్నేమీ అనరు. నువ్వు తెచ్చుకున్న పదో పరకో ఆయనే కట్టి నగ తెచ్చుకుంటాడు ఏం బాబూ"

ఇంటి ఎదురుగా వున్న టీ బంకు శీనయ్య రాజీ చెయ్యడాని కొచ్చాడు. ఇలా రాజీలు చెయ్యడమంటే శీనయ్యకు చాలా సరదా. ఆ రాజీ కుదిరితే అతనికదో గర్వం.

అలాగేనన్నట్లు మాధవరావు తలూపాడు. అతనిది ఎదుట వ్యక్తిని హింసించి ఆనందించాలనే తత్వంకాదు. కాకపోతే పాతికవేలు ఖరీదు చేసే మంచి పచ్చలనగ అది-కారుణ్యకు వాళ్ళ పుట్టింటి వాళ్ళు పెట్టిన హారం తను మరలా చేయించలేని పోగొట్టుకున్న వస్తువు. ఆ ఖరీదు అతణ్ని రాక్షసుణ్ని చేస్తోంది.

"నేనట్టాటోడిని కాదు. నాకు నిజంగా తెలీదు" కాస్త రోషంగా అన్నాడు పోలయ్య.

"అఁ నాకాడ సెప్పకు కతలు. నీ దొంగబుద్ధి నాకు తెలిందా నీలాటోళ్ళుండబట్టే నాలాటోళ్ళకు సెడ్డ పేరొస్తోంది. ఎక్కడెట్టావో ఇప్పటికయినా సెప్పేసేయ్. బాబుగారు కాబట్టి ఇప్పటివరకూ వూరు కున్నారు. మరొకరు, మరొకరు అయితే ఈపాటికి జైల్లో కమ్ములు లెక్కపెట్టుకుంటూ వుండువు. దేవతలాటమ్మ ఏదయినా కష్టమొస్తే ఏభై రూపాయలివ్వమనడిగితే ఇవ్వకుండా వుంటుందా?"

ఆ ఇంట్లో పనిచేస్తున్న ఇంకో నౌకరు, నలభై ఏళ్ళ లక్ష్మమ్మ కసిరినట్టుగా అంది.

పోలయ్య చప్పబడి పోయాడు, నీరసించి పోయాడు.

"ఆదేంది లక్ష్మమ్మా! నోటాత్రంతో వక్క పొలుకో, కోడి గుడ్డు పాలుకో దొంగిలిస్తానుకానీ ఇరవై అయిదువేలుచేసే బంగారం దొంగిలించడానికి నాకెన్ని గుండెలు? నువ్వుకూడా అట్టే మాటాడు తావు."

ఈ హింసాకాండను కమనీయంగా చూస్తున్న జనంలో గుస గుసలు.

"పాతికవేలంట అమ్మో"

"అయినా ఇదేం పాడుబుద్ధి కొట్టమంటే కొట్టడా? ఒకటా రెండా పాతికవేలు."

ఓ అందమైన పాదం గడప అవతలకు రాబోయి సంకోచంగా ఆగిపోయింది.

ఉషారుగా చూస్తున్నారు గుంపులు గుంపులుగా జనం.

అంతమంది మధ్యలో తోలుబెల్టు గాలిలో లేస్తోంది. ఓ అనాచ్ఛాదిత శరీరాన్ని తాకుతోంది. క్షణంలో విషయం అర్థమయ్యేలా చెప్పే సారు జనం. కొత్తగా వచ్చిన కొండల నరశింహానికి.

అతను లోపలికి తొంగి చూసాడు. తెల్లటి ఖాకీ అందమైన విగ్రహం చేతిలో తోలుబెల్టు అతను అఁ అతనే ప్రొద్దున చిలక జోస్యం

చెప్పించుకుని అందరికంటే నాలుగురెట్లు ఫీజు ఎక్కువ ఇచ్చిన మనిషిని ఎలా మర్చిపోతాడు?

ప్రతి మనిషికి గుండె వుంటుంది. అది ఒక్కోక్షణంలో ద్రవిస్తుంది. ఈ క్షణంలో కొండల నరశింహం తాలూకు ద్రవిత హృదయం నిజాన్ని బద్దలు చేసింది. "ఆపండి ఇది అన్యాయం. నేనే ఆ చిలక జోస్యం చెప్పింది. అది అబద్దం"

మాధవరావులో చైతన్యం స్థంభించింది.

అక్కడ వందమంది దాకా రేప్రొద్దున దేనికో ఒకందుకు తన దగ్గరకు లేదా తనలాంటివాడి దగ్గరకు చిలక జోస్యానికి వచ్చే అమాయక జనం వున్నారు. చిలక చెప్పేది వేదంగా నమ్మే మూర్ఖులు ఈ జనములో తొంభయ్ శాతం వున్నారు. అయినా నిజాన్ని నిర్భయంగా ఒప్పుకున్నాడు.

కొండలు—జనం తాలూకు అమాయకత్వాన్ని ఆధారంగా తీసుకుని ఓ పక్షిని అందుకు ఆయుధంగా ఉపయోగించుకుంటూ పొట్ట గడుపుకుంటున్నాడే కానీ తన కళ్ళముందే తన వల్లే ఒక నిర్దోషి ఇలా హింసించబడటం అతను సహించలేకపోయాడు.

అతని రక్తనాళాలు పశ్చాత్తాపంతో స్పందించాయి.

మాధవరావు చేతులు నీరసంగా వాలిపోయాయి.

అతని కళ్ళు పశ్చాత్తాపంతో పోలయ్యవేపు చూసాయి.

పోలయ్య మామూలుగానే చూస్తున్నాడు కానీ మాధవరావుకలా అన్పించలేదు. 'అన్యాయంగా నన్ను కొట్టావుకదూ' అన్నట్లు అనిపించాయి.

తనను దోషినిచేసి చూస్తున్నట్లుగా అన్పించాయి.

ఆ ఇంటి యజమానికి ఆ చూపులు తనని హేళన చేస్తున్నట్లుగా అనిపించలేదు. సవాల్ చేస్తున్నట్లుగా అన్పించలేదు.

ఆ చూపు అతనిలో పశ్చాత్తాపాన్ని రేపింది. తనమీద తనకే అసహ్యమేసింది-ఒక నిర్దోషిని శిక్షించాడు.

ఎందుకని? ఎందుకు ఇలా జరిగింది?

నగపోయిన బాధలేదు ఇప్పుడతనిలో-

తన ఇంటిలో తనకిన్ని రోజులు సేవచేసిన ఒక నిర్దోషి తన వల్ల ఇంతసేపు ఇక్కడ దోషిగా నిలబడ్డాడనే బాధవుంది.

ఇంతమంది ముందు తను ఓ నిరాపరాధిని హింసించాడనే భావం వుంది.

అతను తలెత్తాడు. ఎదురుగా ఈ హింసాకాండకు ఈ అవమానానికి కారణమైన కొండల నరసింహం వున్నాడు. అతని రక్తనాళాల్లో రక్తం మరలా వేగంగా ప్రవహించసాగింది.

"రాస్కెల్! అవాకులు, చవాకులు వాగి నాచేత నా మనిషినే కొట్టేలా చేస్తావా? నువ్వుచేసే వ్యాపారం పచ్చిమోసమనీ తెలిసే ప్రజలని మోసం చేస్తావా?"

మరలా బెల్టు గాలిలోకి లేచింది.

తలుపు వెనుక వున్న కారుణ్య ఈసారి ఘోషా ముసుగు వేసుకోలేదు.

ఆమె కాలు ఈసారి నిర్భయంగా గడపదాటింది.

చీకటిలోనుండి వెలుగులోకి వచ్చిన ఆమె ముఖంలో తన భర్త చేస్తున్న ఈ పని తనకు నచ్చలేదనే భావసంపద.

మాధవరావు తలతిప్పి ఆశ్చర్యంగా బయటకొచ్చిన భార్య ముఖంలోకి చూసాడు.

చూసిన మరుక్షణంలోనే భార్య కళ్ళ పిలుపు అతనికి అర్థం అయింది.

తోలుబెల్టు క్రిందకు వదిలేసి లేచి నిలుచున్నాడు.

"రాఘవులూ! పోలయ్యను లోపలికి తీసుకెళ్ళు. నా టేబుల్‌మీద అయింట్‌మెంటుంది గాయాలు డెట్టాల్‌తో కడిగి అయింట్‌మెంటు రాయి ఇప్పుడే వస్తాను నేను"

పెరటివేపు రాఘవులు పోలయ్యను తీసుకుని వెళ్ళాడు.

కొండలు చల్లగా జారుకున్నాడు.

కారుణ్య అంటే మాధవరావుకి ఎంత ప్రేమ వుందో-అంత గౌరవం కూడా వుంది.

ఎందుకంటే ఆమె ఎవర్నీ విమర్శించదు. విమర్శించాల్సి వస్తే అది సహేతుకంగానే వుంటుంది.

భార్య పిలుపుని స్వీకరించి లోపలికి నడిచిన మాధవరావుకు కిటికీ కమ్మీలు పట్టుకుని బయటకు చూస్తున్న కారుణ్య హాలులోనే కనిపించింది.

అతను దగ్గరగా నడిచాడు.

"కారుణ్యా"

కారుణ్య వెనక్కి తిరిగింది.

సూటిగా భర్త కళ్ళల్లోకి చూసింది.

"పొట్టకూటికొరకు ఏదో వ్యాపారం చేసుకుంటున్న అతనికెందుకు తగలాలి దెబ్బ?"

"నిజమే నాది తప్పేకానీ వాడు....వాడు ఆ వెధవ....యిలా ప్రజల్ని నమ్మించడం....ఆ వ్యాపారం...." ఆవేశంగా అగాడతను.

"అతన్ని సమర్థించడంలేదు నేను. అతని వ్యాపారాన్ని ప్రోత్సహించడంలేదు. మనలో....మనలో ఇలాంటి అమాయకత్వం, గుడ్డిగా

నమ్మేతత్వం పోనంతవరకు ఇలాంటి వ్యాపారస్తులు పుట్టగొడుగుల్లా పెరిగిపోతూనే వుంటారు. మారాల్సింది వాళ్ళు కాదు మనం. మనం మారిననాడు వాళ్ళుండరు"

"మీరెత్తిన బెల్టుదెబ్బ తగలాల్సివస్తే అది నాకు తగలాలి. అంత ఖరీదయిన నగను దాచుకోవాలిగానీ నలుగురూ తిరిగేచోట ఆ నగను పెట్టి నేను పోగొట్టుకుంటే నా అజాగ్రత్తకు నోర్మూసుకుని వూరోక్కవాలి–లేదా కళ్ళతో చూస్తేనే అడగాలి.

అంతేగానీ నోరులేని చిలకతో వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి చెప్పాడని పోలయ్యకు సాటిమనిషిని నిలదీసి అడగడమే తప్పు–ఆపైన నిర్దయగా కొట్టడమూ తప్పే"

ఆమె విశాలమైన కళ్ళల్లో నిర్మలమైన కన్నీళ్ళు.

"కారుణ్యా" అతను ఆమెను గుండెలకు హత్తుకున్నాడు.

ఆమె కన్నీళ్ళు అతని భుజంమీద రాలిపడ్డాయి.

"సారీ! కారుణ్యా సారీ! వెరీ సారీ"

*